ప్రజాశక్తి

ఆదివారం 11 ఆగస్టు 2024

5



అల్లూరి సీతారామరాజు

వంతెన మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని గోమంగి గుల్లేలు పంచాయితీలు ఆనుకుని ఉన్న మర్రిపుట్టు గ్రామ సమీపంలో వంతెనను మరమ్మతు చేయాలని గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జంపరంగి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బ్రిడ్జి కూలి పోయిందన్నారు. దీంతో, పాడేరు నుండి బొంగరం బస్సు రాకపోకలకు అంతరాయం ఏర్పడటం తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మర్రిపుట్టు బ్రిడ్జి మరమ్మతులు చేయాలని కోరారు. లేకుంటే పరిసర గ్రామస్తులతో ఆందోళన చేస్తామన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న నాయకులు

కాఫీలో అంతర పంటలతో అధిక లాభాలు

-కలెక్టర్ దినేష్ కుమార్

-మోదపల్లిలో కాఫీ తోటల పరిశీలన

- సమస్యలను పరిష్కరించాలని కోరిన రైతులు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మండలంలోని మోదపల్లి కాఫీ తోటలను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శనివారం పరిశీలించారు. కాఫీ పంట, పల్పింగ్, పార్చ్మెంట్, అమ్మకాలు తదితర వివరాలపై కాఫీ రైతులతో చర్చించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ, గ్రామంలో ఎఫ్‌పిఓలుగా ఏర్పాటు అయ్యామని, తమ గ్రూపులకు డీజిల్ పల్పర్ యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పంట దిగుబడి కోసం నిచ్చెనలు సరఫరా చేయాలని కోరారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం మరమ్మతులకు గురైందని, దానిని బాగు చేయించాలన్నారు. గ్రామం నుండి కాఫీ తోటల వరకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిరియాల కోసం సిల్వర్ ఓక్ మొక్కలు నాటే సందర్భంలో వాటితోపాటు, మామిడి నేరేడు మొక్కలు పెంచాలని సూచించారు. అదేవిధంగా కాఫీ తోటలలో అంతర పంటగా అత్యధిక లాభాలు వచ్చే జాజికాయ, జాపత్రి, లవంగాలు, యాలకులు వంటి ఇతర స్పైసెస్ మొక్కలు వేయడంతో అధిక లాభాలు సంపాదించవచ్చని సూచించారు. కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసి ట్రయల్ బేసెస్‌లో జాజికాయ, యాలకులు వంటి మొక్కలు పెంచడానికి అవకాశాలను అధ్యయనం చేస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులకు కావలసిన బేబీ పల్పర్ల్, డీజిల్ యూనిట్లు, నిచ్చెనలు వివిధ పథకాల ద్వారా అందించడానికి గల అవకాశాలను పరిశీలించాలని స్పైసెస్ బోర్డ్ సీనియర్ క్షేత్ర అధికారి బి. కళ్యాణి , జిల్లా ఉద్యాన అధికారి రమేష్ కుమార్‌రావులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో సామ్ రత్నాకర్ ఫిలిప్స్, స్థానిక ఎఫ్‌పిఓ అధ్యక్షులు కే సూరిబాబు, కార్యదర్శి బి.దేవి, రత్నాకర్ రాజు, కాఫీ, మిరియాల రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

చట్టాల రక్షణకు పోరాటం

ఆదివాసీ గిరిజన సంఘం నేతల పిలుపు

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం పెట్రోల్ బంక్ నుంచి కామాయపేట జంక్షన్ వద్ద వాయిద్యాలతో దింసా నృత్యాలతో గిరిజనులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా స్వతంత్ర సమరయోధులు, మన్యం పోరాట వీరులు మర్రి కామయ్య, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు గిరిజన సంఘం నేతలు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ ఉద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 1/ 70, పీసా, అటవీ హక్కుల రక్షణకై ఆదివాసులందరూ ఐక్య పోరాటం చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వెంటనే స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పనకై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సింహాచలం, గిరిజన సంఘం అధ్యక్షులు సోమన, కార్యదర్శి వి. లక్ష్మణరావు అప్పలకొండపడాల్, అప్పారావు, కృష్ణమూర్తి, నూకరాజు, పంచాయతీ విఆర్ఓ, ధనసాని కొండబాబు, వెలుగు సిసి నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో యుటిఎఫ్‌ది ప్రత్యేక స్థానం

- సంఘం జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు

- స్వర్ణోత్సవాలు సందర్భంగా జెండా ఆవిష్కరణలు



రంపచోడవరంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విల్సన్‌బాబు, నేతలు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఉపాధ్యాయ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)కి ప్రత్యేక స్థానం ఉందని ఆ సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా శనివారం స్థానిక సంఘం కార్యాలయం జెండాను ఆవిష్కరించారు. అనంతరం విల్సన్‌బాబు మాట్లాడుతూ 50 ఏళ్ల యుటిఎఫ్ ప్రస్థానంలో ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిందని, చరిత్రలో సుస్థిర స్థానం దక్కించుకుందని తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలు ఈ ఏడాది డిసెంబర్ 14, 15, 16, 17 తేదీల్లో ఉమ్మడి జిల్లా కాకినాడలో జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ కార్యకర్తలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా, మండలాల నాయకులు కవిత, కె.ఆదిరెడ్డి కృష్ణయ్య, వెంకట్ నారాయణ, సిహెచ్.సనాతన బాబు, ఎన్.వెంగళరావు, కె.కృష్ణారెడ్డి, కె.చిన్నిబాబు, కె.శ్రీనివాస్, డిపి లింగన్న, కారం సూరిబాబు, సుస్మిత, ఓంకార్, చోడి వెంకటేశ్వరరావు, మంజుల, వెంకటలక్ష్మి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యుటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పైడిమల్లు, పి రమణ అన్నారు. శనివారం రాజవొమ్మంగిలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.ఉదయ్ మనోహర్, లక్ష్మీ ప్రసన్న, వెంకటలక్ష్మి, శ్రీను, రమేష్ తదితరులు మాట్లాడుతూ ప్రతి యుటిఎఫ్ కార్యకర్తా ఒక సైనికుల్లా పనిచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సత్యవతి, పి.రమేష్, ఎల్ గంగరాజు, ఎం రాజుబాబు, ఎల్ కొండబాబు, జి నానాజీ, జి శ్రీను, బి శ్రీను, మూర్తి పాల్గొన్నారు.

కూనవరం : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో యుటిఎఫ్ స్వర్ణోత్సవ పతాకావిష్కరణ కార్యక్రమం యుటిఎఫ్ కోశాధికారి యం.రాంబాబు ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకులు ఎవరున్నా యుటిఎఫ్ ఉపాధ్యాయుల పక్షాన నికరంగా నిలబడి అలుపెరుగని పోరాటం చేసిందని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు టి.సుబ్బారావు, శాంత, సత్యవతి, కుమారి, నాగదుర్గ, గౌతమి, కుమారి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండల కేంద్రం సంత వలస ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఆ సంఘం జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కే.రఘునాథ్ యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అగ్రగామిగా ఉందన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్, అప్రెంటిస్ విధానం రద్దు, ఆన్ ట్రెయిన్డ్ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం, సిపిఎస్ రద్దుపై, 117 జీవో రద్దుపైనా, గిరిజన ఉపాధ్యాయుల జీతభత్యాలు కోసం పోరాటం చేస్తూ అగ్రభాగాన నిలిచిందనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.కన్నయ్య, ఎస్ బాలకృష్ణ లింగన్న, దుక్కు, మేఘనాథ్, శ్యాంసుందర్, యం.మోహన్, ఏం.బాబురావు పాల్గొన్నారు

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోనీ ప్రధాన రహదారి వద్ద మండల యుటిఎఫ్ అధ్యక్షులు సమరెడ్డి రాజు అధ్యక్షతన స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు కే. సూర్యనారాయణ, చిన్నయ్యలు యుటిఎఫ్ జెండాని ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధర్మారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకలు సమరెడ్డి రాజు, సీసా గోపి, సిహెచ్. త్రినాధం, సీనియర్ ఉపాధ్యాయులు కిముడు. సూర్యనారాయణ, ఒలుగు చిన్నయ్య పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం శనివారం అరకులోయలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాంగుల చిట్టిబాబు మాట్లాడుతూ, యుటిఎఫ్ బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు టి విజయ్ కుమార్, రామచంద్రరావు, కార్యకర్తలు రామ చంద్రరావు, ఎం.రమణమూర్తి, స్వామి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోనీ కాశీపట్నం పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ విశాఖ ఉమ్మడి జిల్లా పూర్వ సహాధ్యక్షులు శెట్టి. రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి సింహాచలం, మండల సీనియర్ నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు జెవై దొర యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మల్లేశ్వరరావు, విజయ్, పరమేశ్వరరావు, నారాయణరావు, గంగరాజు, స్వామి నాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో...



ముంచంగిపుట్టులో ...

'మధ్యాహ్న' కార్మికుల బకాయిలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి పడ్డ నాలుగు నెలల 15 రోజుల వేతనం వెంటనే చెల్లించాలని, లేకుంటే చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అధికారులకు, ప్రభుత్వానికి హెచ్చరించారు. శనివారం చింతపల్లి సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి లక్ష్మి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజనం కార్మికులు ప్రతి మండలంలో 300 నుంచి 400 మంది వరకు ఉన్నారని, జిల్లాలో ఐదు వేల మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. కార్మికులకు ఇచ్చేదే నెలకు 3వేలని ఆ జీతం కూడా నెలలు తరబడి ఇవ్వకుంటే కుటుంబాలతో ఎలా బతుకుతారని ప్రశ్నించారు. పిల్లలు తక్కువగా ఉన్నారన్న ఉద్దేశంతో గొందిపాకల పంచాయితీ అదే గ్రామంలో సంవత్సరం నుంచి పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికురాలిని హెచ్‌ఎం తొలగించారని, ఇది ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కె పద్మ, తండా సింహాచలం, ముట్టడం శకుంతల, చంద్రకళ, వనగాల దినకుమారి, రాజేశ్వరి, కిముడు బాబురావు, చిన్నమ్మి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వసతిగృహాల్లో కార్మికులను నియమించాలని

ఎఐఎస్ఎఫ్ నేతల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన వసతి గృహాలలో వర్కర్స్ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్, డిగ్రీ హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర, జిల్లా నాయకులు ఐటిడిఏ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్ నాగభూషణం మాట్లాడుతూ, ఇంటర్, డిగ్రీ కాలేజీ హాస్టల్ వర్కర్లను శాంక్షన్ పోస్టల ద్వారా భర్తీ చేయకపోవడంతో ప్రభుత్వ నుంచి విద్యార్థులకు వచ్చే మెస్ ఛార్జీల నుంచి కట్ చేసి సంక్షేమ హాస్టల్లో పని చేస్తున్న వర్కర్స్‌కి నెలనెలా హాస్టల్ వార్డెన్స్ జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రకంగా గిరిజన వసతి గృహాలలో శాంక్షన్ పోస్టులు లేకపోవడంతో వార్డెన్స్ విద్యార్థులకు పెట్టే భోజనంలో మెనూని తగ్గించి వర్కర్స్ కి జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్, బాబ్జి, చిన్నాబాబు, దేవదాస్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని వన గుమ్మ, రంగ భయలు పంచాయతీల పరిధిలోని డిఆర్ డిపోల నుండి అంగన్వాడి కేంద్రాలకు సకాలంలో సరుకులు పంపిణీచ చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్‌రావు ఆధ్వర్యంలో జిసిసి అధికారులకు వినతి పత్రాన్ని శనివారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలకు ప్రతి నెలా డిఆర్ డిపోల నుండి సకాలంలో సరుకులు అందలేదని, బయోమెట్రిక్ వేసిన మరో వారం, పది రోజుల తర్వాత డిపో నుండి సరుకులను అందిస్తున్నారని తెలిపారు. సేల్స్‌మెన్‌కు సరుకులు అన్ని ఒకే దపాలో అందించాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలకు సరుకులు సక్రమంగా అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి నెలా అంగన్వాడి సెంటర్లకు సరుకులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సిపిఎం సర్పంచ్ కె త్రినాథ్, పి.భీమరాజు. పి.మంగ్లీ, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

హక్కులను వినియోగించుకుని అభివృద్ధి కావాలి

ఎఎస్‌పి జగదీష్ హడహళ్లి



గిరిజన చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఎఎస్‌పి జగదీష్ తదితరులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న హక్కులను గిరిజనులు వినియోగించుకొని అభివృద్ధి చెందాలని రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ హడహళ్లి అన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్డ్ ఆదేశాల మేరకు మండలంలోని దాకరాయి గ్రామంలో ఏఎస్పి జగదీష్ ఆడహళ్లి, సిబ్బంది శుక్రవారం పర్యటించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఏఎస్పీ మాట్లాడుతూ ఆదివాసి దినోత్సవం నేపథ్యం వివరించారు. గిరిజనులు వారికి రాజ్యాంగం ద్వారా సంక్రమించే హక్కులను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ప్రతిఒక్క పిల్లవాడిని చదివించాలని, యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలు జోలికి వెళ్ళవద్దని, గంజాయి రవాణా, క్రయ, విక్రయాలను నిర్మూలించాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు దుప్పట్లు, బిరియాని ప్యాకెట్లు స్వీట్లు, పిల్లలకు బిస్కెట్లు, రొట్టెలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు ఎస్ వెంకయ్య, రఘునాథరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలారం రహదారి గుంతలమయం

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు



రహదారి మధ్యలో ఉన్న పెద్ద గొయ్యిలో వర్షపు నీరు

ప్రజాశక్తి- కొయ్యూరు

గొలుగొండ మండలం చోద్యం నుండి కొయ్యూరు మండలం బాలారం వెళ్లే రహదారి ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. రహదారి మొత్తం గుంతలుగా మారి ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఈ మార్గంలో ప్రయాణమంటే నరక ప్రాయమేనని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అయితే ఎక్కడ గొయ్యలు ఉంటాయో తెలియక అనేకమంది ప్రమాదాల బారిన పడి చేతులు కాళ్లు విరగొట్టుకుంటున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రహదారిలో ప్రయాణం కారణంగా ద్విచక్ర వాహనాలు, కార్లు తొందరగా మరమ్మతులకు గురవుతున్నాయని, దీంతో వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితులు వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొయ్యూరు మండలానికి చెందిన ఆరు పంచాయతీ పరిధిలోని గ్రామాలు ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారి గుండానే తూర్పుగోదావరి జిల్లా తుని వంటి ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. దీంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రహదారిలో కనీసం గుంతలనైనా పోర్చాలని స్థానికులు అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు ఈ రహదారిపై దృష్టి సారించి కనీసం మరమతులైన చేయించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 11న ఆదివారం రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) అవసరమైన వారికి పరమ హంస యోగానంద నేత్రలయానికి తరలించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకొని రావాలని కోరారు.

బుద్ధదేవ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్యకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.లోకనాథం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, 2000 నుంచి 2011 వరకు వరుసగా 11 సంవత్సరాలు పశ్చిమ బెంగాల్ సీఎంగా ఆయన సేవలందించారని కొనియాడారు. డివైఎఫ్ఐ నుండి ప్రజానాయకుడు ఎదిగారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రజాతంత్ర ఉద్యమం అభివృద్ధికి సుదీర్ఘ కాలం సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం సుదీర్ఘ కాలం నడవడానికి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరీ, కేవి.సూర్యప్రభ, యూటిఎఫ్ నాయకులు గాయత్రి, ఎం.చిట్టయ్య, కేవీపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ముఠా కార్మిక సంఘం నానాజీ, అంగనాడి యానియన్ నాయకులు ఆర్.రమణమ్మ, పర్వీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ, జ్ఞానేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి-కొత్తకోట:అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని విశాఖపట్నం అంబేద్కర్ భవన్ చైర్మన్ బొడ్డు కళ్యాణ్‌రావు తెలిపారు. రావికమతం మండలం కేంద్రంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థినిలకు చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్, రిటైర్డ్ సివిల్ జడ్జ్ నడుపురి సన్యాసిరావు ఆర్థిక సాయంతో సమకూర్చిన పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి అభివృద్ధిలోకి రావాలన్నారు. ఉన్నతమైన స్థానాలల్లో ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్క ర్ ట్రస్ట్ నిర్వాహకులు కండెల్లి వెంకట్రావు, భూపతి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:ఎస్సి వర్గీకరణ పై సుప్రీంకోర్టు పున:ఆలోచన చేయాలని కోరుతూ రావికమతం మండలం కొత్తకోటలో బిఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. స్థానిక బియస్ రోడ్డులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు మల్లేటి రాజు, బి.బుల్లిబాబు, పూడి దేవ, అప్పారావు, కాగిత గంగరాజు, బి.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అంటూ గతంలో సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు.ఏబిసిడి వర్గీకరణతో 16 ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా శాంతి ర్యాలీ, మూడు రోడ్డు కూడలిలో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పూడి అర్జున్, మరువాడ అర్జునరావు, టి.శేఖర్, పూతి అప్పారావు, బి.చిరంజీవి పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారుల సంబరాలు

ప్రజాశక్తి- నక్కపల్లి:పారిస్ ఒలింపిక్స్‌లో జరిగిన హాకీ టోర్నమెంట్‌లో భారత్ హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంతో నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ముందుగా హాకీ క్రీడాకారులంతా జాతీయ జెండాలు చేతబట్టి జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ, విజయం సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం క్రీడా మైదానంలో కేక్ కట్ చేసి సందడి చేశారు. ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు, సీనియర్ జాతీయ క్రీడాకారుడు గాజుల రామచంద్రరావు, రజిత్, నానాజీ తదితరులు విజయం సాధించిన టీం ఇండియా హాకీ క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు .

గంజాయి, నాటు సారాలపై గట్టి నిఘా

ప్రజాశక్తి- మాడుగుల: గంజాయి, నాటు సారాలపై గట్టి నిఘా పెట్టామని ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ ఆధారిటి ఆధ్వర్యంలో మాడుగుల, జి.గదబురు గ్రామంలో గంజాయి, నాటుసారా నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సై దామోదర్ నాయుడు, స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావులు మాట్లాడుతూ, గంజాయి, నాటుసారా ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. ప్రజలు ఈ రెండిటికి దూరంగా ఉండాలని చెప్పారు. వైద్యులు ప్రసాద్ పాత్రుడు, లీలా ప్రసాద్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై, న్యాయవాదులు ఎల్లరావు, కృష్ణ, ప్రమోద్ పాల్గొన్నారు.

రమణకు ఘన నివాళి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో విశాఖ డెయిరీ మాజీ వేతన కార్యదర్శి పుణ్యమంతుల రమణ 4 వ వర్ధంతిని ఆయన కుటుంబ సభ్యులు, విశాఖ డెయిరీ ఉద్యోగులు, స్నేహితుల శనివారం ఘనంగా నిర్వహించారు. పాల సొసైటీ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అర్హులైన గిరిజనులకు డిఎస్‌సి ఉచిత శిక్షణ

- 12 నుండి అందుబాటులో దరఖాస్తులు
- 17వ తేదీన స్వీకరణ గడువు ముగింపు
- ఐటిడిఎ పిఒ అభిషేక్



ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి మెగా డీ ఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో 300 మంది గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు డిఎస్సీ ఉచిత కోచింగ్ ఇస్తున్నామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలోని 11 మండలాలకు చెందిన డిగ్రీ, బీఇడి/ ఇంటర్, డిఇడి మరియు టెట్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 12 వతేదీ నుండి ఐటిడి ఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ నుండి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ లోపు ఐటిడిఏ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. డిగ్రీ బిఇడి, ఇంటర్, డి ఇడి, టెట్ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా ఫైనల్ జాబితాను ఈనెల 20 వ తేదీన ప్రకటిస్తామన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఐటిడిఏ నోటీస్ బోర్డులో పెడతామన్నారు. డిఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపికైన 300 మంది గిరిజన అభ్యర్థులకు సుమారు 75 నుండి 90 రోజులు విశాఖపట్నం టిసిఆర్ అండ్‌టి.ఎంలో అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మహిళా అభ్యర్థులకు రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఐటిడిఏ అందిస్తున్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్: 08935 250 833 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

వైజాగ్ - చెన్నయ్ కారిడార్ నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులకు భూసేకరణ చట్ట ప్రకారం అన్ని విధాల ఆదుకోవాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. చందనాడ తుఫాన్ భవనంలో శనివారం కారిడార్ నిర్వాసితులు తమ సమస్యలపై చర్చించుకునేందుకు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, చందనాడ ఎంపిటిసీ సభ్యులు గంటా తిరుపతిరావు, గ్రామ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్, సిఐటియు మండల కన్వీనర్ ఎం.రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైజాగ్ –చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ భూసేకరణ సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు కోల్పోతున్న వారిలో 18 సంవత్సరాలు నిండిన వారికి 25 లక్షలు, భూసేకరణ సందర్భంగా ఉపాధి కోల్పోతున్న నిర్వాసితులలో 18 సంవత్సరాలు నిండిన వారికి 15 లక్షలు చెల్లించాలని తెలిపారు.ఈ గ్రామాలలో నివశిస్తున్న అన్ని సామాజిక తరగతులు వారికి ప్యాకేజీ ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ నిర్వాసితునికి ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. అదేవిధంగా గ్రామాల వారీగా నిర్వాసితులు పెట్టుకున్న దరఖాస్తులను సర్వేలు చేసి ఆ సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. చందనాడ దళితుల గుల్లబట్టీలు, డీ ఫారం భూములకు నష్టపరహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిరాయితీ భూములతో సమానంగా డీ ఫారం, సాగు భూములకు నష్టపరహారం చెల్లించాలని కోరారు. మత్స్యకారులకు జీవనోపాధికి ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని, మత్స్యకారుల సొసైటీ భూములకు నష్టపరహారం చెల్లించాలన్నారు. అధికారులకు భూములను స్వాధీనం చేసుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆత్రుత నిర్వాసితులను ఆదుకోవడంలో చూపకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎం.రాజేష్, జీ.గోవింద్, పి.రమణ, వై.రమణ. పి.వెంకట రమణ, వై.మన్నియ్య, పి.సువర్ణ రాజు, పి.వీరన్న, వి.కృష్ణ, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

ప్రజాశక్తి -కొత్తకోట:చోడవరం సివిల్ జడ్జి బి.సూర్యకళ ఆధ్వర్యంలో కొత్త కోట ఎస్సై లక్ష్మణరావు సహకారంతో చీమలపాడు పంచాయతీ గిరిజన గ్రామాలైన కళ్యాణపులోవ, జెడ్.జోగుంపేట గ్రామాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. ఈ శిబిరానికి రెండు గ్రామాల నుంచి సుమారు 152 మంది రోగులు హాజరయ్యారు. వచ్చిన రోగులకు కొత్తకోట పిహెచ్‌సి వైద్యులు సురేఖ వినయ్, చేతన, రజని, వికాస్, దినేష్ తదితరులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్‌యస్ రమణ,హెచ్. వి.ఎర్రమ్మ, వైద్యసిబ్బంది జోషిణి, స్వరూపా, లక్ష్మి, అనిత, వరలక్ష్మి, మౌనిక, రామలక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:మండలంలోని కోనాం గిరిజన గ్రామంలో ఏజెఎఫ్ సీఎం బి.సూర్య కళ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గిరిజనులకు, పేదలకు వైద్య చికిత్సలు నిర్వహించి అవసరమగు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు, ఏఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు

బయలుపూడిలో అపారిశుధ్యం

ప్రజాశక్తి - చీడికాడ

గ్రామం మధ్యలో చెత్తా చెదారం తో పారిశుధ్యం లోపిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బయలుపూడి గ్రామం మధ్యలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం దగ్గరలో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాలతో పెరిగి పోయాయని తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు చెత్తాచెదారంతో దోమలు, ఈగలు బాగా పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరారు.

నేరాలు ఘోరాలు



నిందితులతో పోలీసులు

102 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి: ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు చిత్రకొండ ప్రాంతం నుంచి అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని బలపం, కోరుకొండ మైదాన ప్రాంతం నర్సీపట్నం మీదుగా కాకినాడ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న రూ. 5 లక్షలు విలువ చేసే 102 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని రంపచోడవరం ఏఎస్ పి జగదీష్ తెలిపారు. చింతపల్లి సీఐ రమేష్‌తో కలిసి ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు శనివారం తెల్లవారుజామున అన్నవరం ఎస్సై రాజారావు ఆధ్వర్యంలో అన్నవరం పోలీస్ సిబ్బందితో లోతుగెడ్డ వంతెన వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తుండగా బలపం కోరుకొండ మీదుగా మైదాన ప్రాంతం కాకినాడకు తరలిస్తున్న ఆటోను పరిశీలించామన్నారు. 102 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఆటోలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ఒరిస్సా రాష్ట్రం నుంచే ఎక్కువగా గంజాయి రవాణా జరుగుతుందని తెలిపారు. అక్రమంగా గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను వదిలిపెట్టేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో అన్నవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరు శివారు జంగం బంద చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఏ కోడూరు ఎస్సై జె.రమేష్ తెలిపారు. 35 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువకుని శరీరం పూర్తిగా ఉబ్బి పోయి గుర్తు పట్టని విధంగా ఉందని పేర్కొన్నారు. తెలుపు నలుపు రంగుల అడ్డగీతలతో ఉన్న టీ షర్టు, జీన్ ప్యాంటు వేసుకున్నాడని, మృతదేహం ఆచూకీపై సంబంధిత వ్యక్తులు ఎ.కోడూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన యువకుడు పాలూరి రామకోటేశ్వరరావు (25) విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు వెల్లడించారు. రామకోటేశ్వరరావు శనివారం ఉదయం తమ ఇంటిపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో విద్యుత్ లైన్‌కు తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు డెక్కన్ కంపెనీలో పనిచేస్తున్నాడన్నారు.మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

నక్కపల్లి:మండలంలోని ఎన్.నరసాపురం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ దాకారపు రాములు (45) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు వెల్లడించారు. దాకారపు రాములు ఎలక్ట్రీషన్‌గా పనిచేసేవాడు. శనివారం ఉపమాక పంచాయతీ శివారు కొండవెనుక పాలెం గ్రామంలో గొర్ల తాతారావు నిర్మిస్తున్న నూతన గృహానికి వైరింగ్ చేసేందుకు వెళ్ళాడు వైరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రాములు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో, వెంటనే ఆయన్ను నక్కపల్లి సిహెచ్‌సికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ ఐ తెలిపారు. మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగానికి, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి ప్రజలను వాటికి దూరంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ ర్యాలీని శనివారం ఉదయం ఆర్‌కె.బీచ్ రోడ్డులో సిటీ పోలీస్ కమిషనర్ బాగ్చీతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, వివిధ విభాగాల అధికారులతో కలిసి ర్యాలీలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోగ్రాఫిక్ డివిడెండ్ అనే కాన్సెప్ట్‌పై వ్యసనాల ప్రభావం తీవ్రంగా పడుతుందని పేర్కొన్నారు. గంజాయి మహమ్మారి చాలా సమస్యలకు మూలకారణమన్నారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాల బారి నుంచి బయట పడేందుకు అందరూ డి అడిక్షన్ సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాల, యునివర్సిటీ విద్యార్థులు క్యాంపస్ అంబాసిడర్లుగా తయారవ్వాలని.. తోటి యువతలో మార్పు తీసుకురావాలని హితవు పలికారు. గంజాయిలాంటి మహమ్మారిని తరిమికొట్టేందుకు అన్ని రకాల చర్యలూ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గంజాయి సరఫరా, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ నషా అంటే కేవలం గంజాయి వినియోగం మాత్రమే కాదని, అన్ని రకాల మత్తు పదార్థాలు, వ్యసనాలూ అని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేడు జాతీయ సమస్యగా మారిందని.. దీన్ని అరికట్టేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఫ్యాషన్‌గా భావించి యువత మత్తులోకి దిగవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ డిడి.రామారావు, బిసి సంక్షేమ శాఖ అధికారిణి శ్రీదేవి, విద్య, న్యాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎఎస్ఐ మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎఎస్ఐగా పని చేస్తున్న మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన పూసం పెద్దబ్బాయి (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. పెద్దబ్బాయి శుక్రవారం రాజవొమ్మంగిలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దబ్బాయి ఏలేశ్వరంలో నివాసముంటున్నారు. తన ఇంటి వద్ద శనివారం పెద్దబ్బాయికి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెద్దబ్బాయి ఆకస్మిక మృతికి ఆదివాసీ జేఏసీ నాయకులు వంతు బాలకృష్ణ, లోతా రామారావు, వజ్రపు అప్పారావు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతితో మండలంలోని లాగరాయ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


సిఐగా కన్నపరాజు నియామకం



ప్రజాశక్తి-ఎటపాక : చింతూరు సబ్ డివిజన్ పరిధి ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.కన్నపరాజు నియామకమయ్యారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇంటిలిజెన్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కన్నపరాజు ఎటపాకకు బదిలీ అయ్యారు. కాగా ఎటపాక సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఏం చేద్దాం ?

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై టిడిపిలో చర్చ
- పోటీపై ఏకాభిప్రాయానికి రాలేని కమిటీ
- నేడు మరోసారి సమావేశం



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీపై టిడిపిలో సందిగ్ధత కొనసాగుతోంది. గెలవడానికి సరిపడినంతమంది స్థానిక సంస్థల ఓటర్లు కూటమికి లేకపోవడంతో పోటీ చేసి ఓటమిపాలయ్యాకంటే పోటీ చేయకపోవడమే మంచిదన్న అభిప్రాయంతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి విశాఖపట్నానికి చెందిన కూటమి ఎమ్మెల్యేలు కొంతమంది తమ అభ్యర్థిని గెలిపించుకుంటామని విశ్వాసంతో చెప్పినప్పటికీ చంద్రబాబు మాత్రం అభ్యర్థిని పెట్టడానికి సానుకూలంగా లేనట్లు తెలిసింది. తమ పార్టీ అభ్యర్థి గెలవడానికి తగిన సంఖ్యాబలం లేనప్పుడు పోటీచేసి ఓటమిపాలైతే అప్రతిష్టపాలవుతామన్న ఆలోచనలో ఆయన ఉన్నట్లు సమాచారం. కూటమి తరపున టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని బరిలో పెట్టాలని కొంతమంది ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో వాస్తవ పరిస్థితిని మదించి నివేదిక సమర్పించాలని చంద్రబాబు ఆరుగురితో ఓ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.

రెండ్రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించినా.. ఆ కమిటీ సభ్యులు పోటీపై ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. తగిన సంఖ్య లేనప్పుడు పోటీ చేయకపోవడమే ఉత్తమమని కొంతమంది, పోటీచేస్తే తమ అభ్యర్థిని బలపర్చే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు చాలా మంది ఉన్నారని మరికొంతమంది ఎమ్మెల్యేలు చెప్పుకొచ్చారు. కమిటీ సభ్యుల మధ్య స్పష్టత లేకపోవడంతో ఊహలతో కాకుండా వాస్తవ పరిస్థితులను చంద్రబాబుకు నివేదించేందుకు ఆదివారం కూర్చొని చర్చించాలని వారంతా అనుకున్నారు. ప్రస్తుతం 838 మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల్లో వైసిపికి చెందిన 600 మందిలో పది మంది కూడా కొత్తగా బహిరంగ మద్దతు తెలిపినవారుగానీ, కూటమి పార్టీలో చేరినవారుగానీ లేనప్పుడు గెలుస్తామని చెప్పడం సరికాదన్న అభిప్రాయంతో కమిటీ సభ్యుల్లో కొంతమంది ఉన్నారు. పోటీ చేయడానికి కుతూహలం చూపుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జి, పివిజి.కుమార్, బత్తుల తాతయ్యబాబు, బైరా దిలీప్ చక్రవర్తిల్లో ఎవరూ పది కోట్లకు మించి ఖర్చు చేయడానికి సుముఖత చూపడంలేదని తెలిసింది. ఎవరు పోటీ చేసినా రూ.40 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. బలం లేకపోవడం, డబ్బు ఖర్చుకు అభ్యర్థులు వెనుకాడ్డంతో పోటీకి దూరంగా వుండడం మంచిదని చంద్రబాబు అన్నట్లు తెలిసింది.

ఎవరెన్ని కుట్రలు చేసినా వైసిపిదే విజయం

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



కార్పొరేటర్లు, సీనియర్ నేతలతో సమావేశమైన బొత్స

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎవరెన్ని కుట్రలు చేసినప్పటికీ ఈ నెల 30న జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాను భారీ ఆధిక్యతతో విజయం సాధించడం తథ్యమని, ఆ విషయంలో జివిఎంసిలోని వైసిపి కార్పొరేటర్లకు సందేహం అక్కరలేదని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం మేఘాలయ హోటల్లో వైసిపి కార్పొరేటర్లతో ఏర్పాటుచేసిన అంతర్గత సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ నెల 13తో ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుందని, దానికి ఒక రోజు ముందుగానే సోమవారం తాను నామినేషన్ దాఖలు చేస్తానని, దానికి కార్పొరేటర్లు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు అందరూ సహకరించాలని కోరారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసిపికి తగినంత సంఖ్యా బలం ఉన్నప్పటికీ, తమతో పోటీకి రావడంలోగల ఆంతర్యం ఏమిటని పరోక్షంగా కూటమి నాయకులను ప్రశ్నించారు. ఎవరు ఎవరి కోసం గేట్లు తెరిచారో 2019 ఎన్నికలలో తాము చూసామన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ వైసిపి విజయం ఖాయమన్నారు. బొత్స సత్యనారాయణ స్థానికేతరుడు అంటున్నారని, మరి అనకాపల్లిలో ఎంపీగా నెగ్గిన సిఎం రమేష్ ఎక్కడి వారని ప్రశ్నించారు.

కార్పొరేటర్లపై బొత్స ఆగ్రహం

ఇదిలా ఉండగా సమావేశంలో పాల్గొన్న కొందరు వైసిపి కార్పొరేటర్లపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తపరిచినట్లు తెలిసింది. ప్రధానంగా జివిఎంసిలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నలుగురు కార్పొరేటర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని అన్నారు. అయితే వారి పేర్లు ప్రస్తావించకుండా తీవ్రస్థాయిలో వారిపై బొత్స ధ్వజమెత్తినట్లు తెలిసింది. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల సమయంలో పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డిని కలిసిన 40 మందికిపైగా కార్పొరేటర్లలో సుమారు 15 మంది ఎన్నికలలో స్వపార్టీకి బదులు వేరే పార్టీ వారికి ఓట్లు వేశారని, వారు ఆ విధంగా వ్యవహరించడానికి ఈ నలుగురు నాయకుల పనితీరే కారణమని ఆయన వ్యాఖ్యానించినట్లు పలువురు తెలిపారు.

విశాఖ - ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీ, ప్రజల అవసరాలరీత్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం – ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08543 విశాఖపట్నం – ఎస్ఎంవి బెంగుళూరు వీక్లీ స్పెషల్ రైలు ఆగస్టు 18 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 15:55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30కి ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. 08544 ఎస్ఎంవి బెంగళూరు – విశాఖపట్నం వీక్లీ స్పెషల్ ఆగస్టు 19 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 15.50 గంటలకు ఎస్ఎంవి బెంగుళూరులో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, బెంగళూరు సెంట్రల్ మీదుగా ప్రయణిస్తాయని, ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

వాల్తేరు రైల్వే డివిజన్‌లోని పలాస–పుండి–నౌపడ–విజయనగరం సెక్షన్‌లో ఆధునికీకరణ పనుల దృష్ట్యా ఆగస్టు 12, 15, 17 తేదీల్లో పలు రైళ్ల రాకపోకల విషయంలో మార్పులు చోటుచేసుకున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు 12830 భువనేశ్వర్ – ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 15న నిర్ణీత సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు బయలుదేరేలా రీషెడ్యూల్ చేశారు. 22974 పూరీ – గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 17న నిర్ణీత సమయం 11:15 గంటలకు బదులు 1.30 గంటలు ఆలస్యంగా 12:45 గంటలకు బయలుదేరుతుంది. 22879 భువనేశ్వర్ – తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 17న నిర్ణీత సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు బయలుదేరుతుంది. 07470 విశాఖపట్నం – పలాస మెము ఆగస్టు 12, 15, 17 తేదీలలో శ్రీకాకుళం రోడ్డులో షార్ట్ టర్మినేట్ అవుతుంది. కావున 07471 పలాస – విశాఖపట్నం మెము ఆయా తేదీల్లో పలాసకు బదులుగా శ్రీకాకుళం రోడ్డు నుంచి బయలుదేరుతుంది.

ఎఐటియుసి జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న ఎఐటియుసి జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు బిసిహెచ్.మసేన్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి పారిశ్రామిక కేంద్రంగా ఉన్న విశాఖపట్నంలో జరిగే సంఘం జాతీయ సమితి సమావేశాలకు ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రం వేదిక కానుందన్నారు. 3వ తేదీన విశాఖ నగరంలో వేలాది మందితో కార్మిక ప్రదర్శన సరస్వతి పార్కు నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ జరుగుతుందని తెలిపారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహమాన్, జెడి.నాయుడు, కోశాధికారి కె.సత్యాంజనేయ పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలకు అనుమతి ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 22వ వార్డు పిఠాపురం కాలనీ కళాభారతి రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ చిరు వర్తకులు శనివారం జివిఎంసి కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిరువర్తకుల తరుపున న్యాయవాది పలకా శ్రీరామమూర్తి మీడియాతో మాట్లాడుతూ 20, 30 ఏళ్లుగా ఇక్కడే తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకుంటూ సుమారు 335 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. జివిఎంసికి రూ.20 ఆశీలు రూపంలో ప్రతి తోపుడు బండి నుంచీ చెల్లిస్తున్నారని తెలిపారు. అయితే వార్డు కార్పొరేటర్ రూ.20 ఆశీలుకు బదులు రూ.40 తనకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందుకు ఒప్పుకోకపోవడంతోనే హైకోర్టులో పిల్ వేసి దుకాణాలు తొలగించాలని జివిఎంసి అధికారులతో ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారని తెలిపారు.

రమణమూర్తికి అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డివి.రమణమూర్తిని ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. నూతన బాధ్యతల స్వీకరణను పురస్కరించుకుని అభినందనలు తెలిపారు.